బాలకపాత్రి

# తప్పెవరిది?

సడెన్ బ్రేక్ వేసి ఆపానుకారు. పదేళ్ళ పిల్ల. చిరుగుల మాసిన పరికిణీతో చింపిరి జుట్టుతో, బెదిరి పోతూ నా వేపూ, కారువేపూ చూస్తూ నిల్చుండి పోయింది.

"బుద్ధిలేని పిల్లా! ఏమిటా పరుగు రోడ్డుకడ్డంగా? కారుకిందపడితే చావవూ?" విసురుగా డోర్ తీసుక బయటికివచ్చి కేకలేసాను.

మరింతగా భయపడ్తూ నా వేపు చూచింది. మరుక్షణంలో ఏమనుకుందో ఏమో, "బాబూ! ఒక్క రూపాయి ఇప్పించండి చాలు!" అంది మెల్లిగా.

అంత కోపంలోనూ ఫక్కున నవ్వొచ్చింది నాకు. పైసా, రెండు పైసలు దానం చేయమంటూ చేయిజాచి యాచించే బిచ్చగాళ్ళెందరినో చూచాను. కానీ ఈ పిల్లలా "ఒక్కరూపాయి ఇప్పించండి!" అంటూ ఎవరూ అడగలేదు నన్ను.

"ఏం చేస్తావ్ రూపాయితో?" కుతూహలంగా అడిగాను.

ఆ పిల్ల నా వేపు ఆశ్చర్యంగా చూచింది. "నీకు తెలీదేటిబాబూ? ఇయాల దీపాల పండగ!" ఆ చిన్ని కళ్ళలో నా తెలివితక్కువ తనానికి జాలి తొణికిస లాడ్తున్నట్లుంది.

"అయితే!" తమాషాగా అడిగాను.

"మరి మాకు డబ్బులేదుగా? మా అక్క, చెల్లెలు, నేను టపాకాయలు కాల్చొద్దూ? డబ్బిమ్మంటే మా అయ్య, అమ్మ చావగొట్టారు నన్నూ మా అక్కనూ!"

కార్లో వెనక సీట్లో ఉన్న ప్యాకెట్లమీద అప్రయత్నంగా నా దృష్టి పడింది. ఎన్నో రకాల బాణసంచా, సుమారు వందరూపాయల పైగా ఖరీదైంది! ఇవన్నీ మా ఎనిమిదేళ్ళ బాబు ఒక్కడే కాలుస్తాడీరోజు!

"మరి మీ మిగతా చుట్టుపక్కల ఇళ్ళ వాళ్ళందరికి వున్నాయా టపాకాయలు?" ఏదో ఆలోచిస్తూ అడిగాను.

"ఊహుం! ఆళ్ళ పిల్లలు కూడా మాలాగే ఏడుత్తున్నారు!"

ఎందుకో ఒక్కసారి ఆ గూడెంలో కెళ్ళిచూడా లనిపిస్తోందినాకు. "నీ పేరేమిటి?" అన్నాను నాందీగా.

"మంగ"

"మీ గూడెం నాకు చూపించు మంగా!" కారు లాక్ చేస్తూ అన్నాను.

"మా గుడిసెలకాడి కొత్తావా!" ఆశ్చర్యంగా నాకేసి చూచింది. నమ్మలేనన్నట్లున్నా యాచూపులు.

"ఏం రాకూడదా?" నవ్వాను.

ఛెంగు ఛెంగున అమితోత్సాహంతో రోడ్డు కవతలగా వున్న చెట్ల గుబుర్ల కేసి పరుగెడుతోంది మంగ. అనుసరించాను నేను. షుమారు రెండు ఫర్లాంగుల దూరంలో గుట్టగా వున్న గుడిసెలు కనిపించాయి. అక్కడక్కడా గోచీలుకూడా లేని పది పన్నెండేళ్ళ లోపు కుర్రాళ్ళు "రోలు రోకళ్లు" రాళ్ళకేసి మోదుతున్నారు. కొందరు పిల్లలు ఆ తమాషా చూస్తున్నారు. అందరికందరూ అర్ధనగ్నంగా, నగ్నంగా వున్నారు. గుడిసెల ముందు కుక్కి మంచాలలో కునికిపాట్లు పడ్తున్నారు వృద్ధులు. కొందరు యువకులు దట్టీలు బిగింది కట్టెలమోపులు కట్టుకుంటు న్నారు. బక్కచిక్కిన తల్లులు, తమ కొత్త సంతానానికి తమ రక్తమాంస

విహీనమైన శరీరంలోనుంచి ఏదో శక్తి పంచిద్దామనే ఆదుర్దాతో పాలులేని పాలిండ్లతో పాలిస్తున్నారు! అస్థిపంజరాల్లాంటి మగవారు దిగాలుపడి కూర్చునివున్నారు. ఎందుకో ఆ దృశ్యం నన్ను కలవరపరుస్తోంది. నాలోని మానవత్వం తాలూకు ఆర్తిని కుదుపుతోంది. వారి శరీరాలలానే, వారి హృదయాలలో జీవితావసరాల తాలూకు కోర్కె కూడా ఎండిపోయిందేమో!

"అయ్యా! ఎవరొచ్చారో చూడు!" సంతోషంగా అరుస్తూ మంగ ఓ గుడిసెముందు ఆగింది. గుడిసెముందు కుక్కి మంచంలో తలవంచుక కూర్చుని వున్నాడో మనిషి. జీబూతంలా పెరిగిన అతగాడి జుట్టులో పేలు కుక్కుతోంది—బహుశా మంగ తల్లి ఆవిడే అయ్యుండవచ్చు. సంవత్సరం నిండని పసివాడు, మంచం మీద నిలబడి, ఆచ్ఛాదనలేని ఆమె వీపుమీద ఉయ్యాల ఊగుతున్నాడు.

"ఎవరో మారాజు!" మంగతల్లి, తండ్రి ఇద్దరూ విస్మయంగా లేచి నిల్చున్నారు. క్షణంలో గూడెమంతా పోగయింది నాచుట్టూరా! ఏమిటో ఆనందం, మరేదో కౌతుకం, వారందరిలో త్రొక్కిసలాడుతోన్నట్లు వారిచూపులే చెబుతున్నాయి. పిల్లలందరూ గుస గుసలుగా ఏదో మాట్లాడుకుంటూ నావేపు చూస్తున్నారు. వారందరికి మంగ గర్వంగా ఏదో వివరిస్తోంది. బహుశా తను నన్నిక్కడికి పిల్చుకు వచ్చిన నైనంకావచ్చు.

"మా గూడేనికి తమలాటి మారాజులు ఏ పనిమీద దయచేసేరో!" దాదాపు ఇదే అర్థంగల గుస గుసలు నా చుట్టూరా ప్రదక్షిణలు చేస్తున్నాయి!

"ఈ రోజు దీపావళి పండగని మీకు తెలీదా?" అడిగాను. ఓ యువకుడు సుమారుగా వున్న ఓ మంచం వేసాడు, నన్ను కూర్చోమని సవినయంగా కోరాడు. కూర్చున్నాను.

"తెల్సు బాబయ్యా! కూటికే గతిలేనోళ్లం! మాకు పండగేటి బాబయా?" నీరసంగా అన్నాడు మంగ తండ్రి. బహుశా వారిలో చాలా మంది రెండు రోజులుగా పస్తులతో మాడుతున్న వారిలా వున్నారు!

"మరి కూలికి వెళ్ళకుండా ఇలా కూర్చున్నారేం అంతా?" సాధారణంగా ఎవడేనా యాచకుడు అన్ని అవయవాలూ బావున్నవాడు కనిపిస్తే నేనామాటే అంటాను!

నాకు మంచం వాల్చిన యువకుడు చేతులు కట్టుక నా ముందుకు వచ్చాడు. "కూలీ కూడా దొరకటం లేదు బాబయా! ఏడేడి జనం ఈ పట్నమాసాల్లోకి వచ్చిపడి, కూలీ కూడా సరిగ్గా దొరక్కుండా సేత్తుండరాయె! మీకింకొకటి తెల్సా దొరా?" ఆ యువకుడు ఆగాడు.

"ఏమిటి?" కుతూహలంగా అడిగాను.

"కూలీ దొరకాలంటే, కూలీ మేస్త్రీలని వున్నారంట బాబూ! ఆళ్ల దగ్గర కెళ్ళి ముందుగానే పదో, పరకో ఇచ్చుకోవాలంట. తర్వాత ఆడు కూలీ సూపిత్తాడంట! ఆ వచ్చే కూలీలో కూడా ఆళ్ళకొక్కొస్త వాటా ఇవ్వాలంట! మరి మాకెట్లా దొరుకుద్ది కూలీ! కట్టెలు కొట్టి అమ్ముకుందామని ఆశేగానీ, అవి మాత్రం ఎవడు కొంటున్నాడు! వున్న మారాజులు అడవులే కొనుక్కుంటున్నారు. లేనోళ్లు స్టవులు వాడుతున్నారంట! నీళ్ళకు బోయిలర్లంట వచ్చాయి గదా? ఇట్లాగే చస్తా బతుకుతుండాం దొరా!"

ఆ యువకుడివేపు చూశాను. శక్తి వుంది! ఆసక్తి వుంది! కానీ ఏం చేయగలడు? క్షణాలమీద మారిపోతున్న ఈ రాకెట్ యుగంలో కంప్యూటర్ల సాయంతో గుమస్తాలకు ఉద్వాసన జరగబోతున్న ఈ రోజుల్లో, మనిషి శ్వాస పీల్చడం కూడా యంత్రాలే చేసి పెట్టబోతున్న ఈ నాగరికయుగంలో, కాయ కష్టానికి విలూ, విలువా, ఎక్కడున్నాయి?

ఆ పిల్లందరికేసి చూశాను. వింతగా నావేపు చూస్తున్న వారి కళ్ళల్లో ఏదో కోర్కె దాగివుంది! ఆ పిల్లలందరూ నాబాబులాటి పిల్లలే! వీళ్ళందరూ నాలాటి, నా శ్రీమతిలాటి తలిదండ్రులే! ఆపిల్లల్లో కోర్కెలున్నాయి. చాపల్యం వుంది. భవిష్యత్తుమీద ఆశ వుంది.

ఆ తలిదండ్రులలో బాగుపడాలన్న ఆకాంక్ష వుంది. కానీ. . .కానీ, వారందరి చుట్టూరా, దారిద్ర్యపు గాఢాంధకారం వుంది! ఒక్క చిన్న దివ్వె వెలిగిస్తే? ఒక్క చిన్న టపాకాయ వెలిగిస్తే ఈ గాఢాంధకారాన్ని కొంత వరకేనా పారద్రోల లేనా? నా బంగళా చుట్టూరా ఈ రోజు వెలిగించే బల్బుల తోరణాల తాలూకు దేదీప్యమానమైన వెలుగులోనికి ఒకేఒక కాంతి రేఖను ఈ గూడెంలో ఈ ఒక్క రోజైనా ప్రవేశ పెట్టలేనా? అదే నిజమైన దీపావళి! ఒక్కసారిగా తీవ్ర నిర్ణయానికొచ్చాను. నా చేతిలో ఉన్న లెదర్ బాగ్‌లో నా శ్రీమతి కోసం ఈ రోజు కొనదల్చుకున్న కెంపుల గాజుల జత తాలూకు ఐదు వందల రూపాయిలూ - అన్నీ పది రూపాయల నోట్లు కొత్తగా బరువుగా వున్నాయి. . .

“మీరంతా వరుసలో నిల్చోండి!” అన్నాను లేచి నిల్చుంటూ. అందరు పెద్దలూ వరుసగా నిల్చున్నారు నమ్రతగా! జిప్ లాగాను. ఒక్కో పది రూపాయలనోటు ఒక్కో కుటుంబ పెద్ద చేతిలో పెట్టాను. “హాయిగా వండుకు తిని, పిల్లలకు టపాకాయలు కొనిపెట్టి, పండుగ చేసుకోండి!” అన్నాను.

అందరి ముఖాలలో ఆనందం తొణికిస లాడుతోంది. కొందరి ముఖాలలో ఇది కలేమోనన్న సంశయమూ తొంగి చూస్తోంది. మరి కొందరి చూపుల్లో నేను వెర్రి వాణ్ణేమోనన్న అనుమానమూ కనిపిస్తోంది. పిల్లల ముఖాలలో మాత్రం ఆనందపు సరతులు వెలుగుతున్నాయి!

"మారాజు. . .మా తండ్రి. . .వెయ్యేళ్ళు బ్రతకాలి!" కారువరకూ దీవెనలు కురిశాయి. . .కారు స్టార్టు చేశాను. నేను పుట్టి బుద్ధెరిగాక, ప్రతి దీపావళికి సుమారు వెయ్యి రూపాయలు. . . బట్టలకై తేనేం టపాకాయల కై తేనేం, లైటింగు అరేంజ్‌మెంట్సుకయితేనేం ఖర్చు కావడం నాకు తెలుసు. ఆ ఖర్చు పెరుగుతోందే గానీ ఏ సారీ తరగటం లేదు!

కానీ ఈ నాడు నా హృదయంలో నెలకొన్న శాంతి గానీ, తృప్తి గానీ, ఈ ముప్పై సంవత్సరాల దీపావళులలో నాకు లభ్యం కాలేదు. ఆ మాట కొస్తే ఏ క్షణంలోనూ ఇంతటి ఆనందం, హాయి కలుగలేదు!

కెంపుల గాజుల కోసం ఆదుర్దాగా ఎదురు వచ్చిన శ్రీమతికి, కారు యాక్సిడెంట్ కాబోయిందనీ, ఆ గొడవలో పర్స్ ఎవరో కొట్టేశారనీ అబద్ధం చెప్పేశాను – నిజం చెప్పే సాహసంలేక! చెప్పినా శ్రీమతి హర్షిస్తుందన్న నమ్మకమూ లేక!

"పోన్లెండి, వెధవడబ్బు పోతే పోయింది. ఏభై వేల రూపాయల కారూ, మీరు పాడై పోలేదు!" అంది శ్రీమతి. ఈయాంత్రిక యుగంలో కారూ–మనిషి విలువయినవన్నా ఆశ్చర్యంలేదు మరి!

సాయంత్రం ఐదుగంటలకల్లా ముస్తాబయ్యాను. శ్రీమతినీ, బాబునూ కూడా ముస్తాబు కమ్మన్నాను. నేను త్వరలో వస్తాననీ ఈ లోగా బంగళా అంతా అలంకరింప జేసి వుంచమనీ చెప్పాను.

"త్వరగా తిరిగి వచ్చెయ్యండి. బాబూ మీరు, టపాకాయలు కాల్చు కుందురుగానీ!" అంది శ్రీమతి హెచ్చరికగా!

"అలాగే!" హుషారుగా కారు స్టీరింగ్ ముందు కూర్చున్నాను. నా హృదయం ఆనందంతో ఉరకలు వేస్తోంది. ఆ గూడెంలోని వారం దరూ హాయిగా అన్నం తిని ఆనందంగా వుంటారేమో? ఆ పిల్లలందరూ

కేరింతలు కొడుతూ రోలు రోకళ్ళు, టపాకాయలు కాల్చుకుంటుంటా రేమో? ఒక్కసారి వారి కన్నుల్లో వెలిగే ఆ దీపాలు చూడాలి! నేను గొప్పగా ఏదో "దానం" చేశానన్న "అహం" తో కాదు! నా తోటి మానవులు కొందరు నాతోబాటు ఆనందాన్ని పంచుకోవటానికి అవకాశం కల్పించ గలిగానన్న ఆత్మ సంతృప్తి పొందటానికే తహ తహ! కారు జోరుగా వెడుతోంది. . .

సడెన్ బ్రేకు వేశాను, దూరాన చెట్ల గుబుర్ల మీదుగా దట్టమైన పొగ. . .అగ్ని కీలలు సుడులు తిరుగు తున్నాయి! ఆ గుడిసెలవేపునించి గోల గోలగా రోదనలు వినిపిస్తున్నాయి! ఒక్క సారిగా షాక్ తిన్నట్ల య్యాను! ఏమిటా పొగ? ఏమిటా మంటలు? టపాకాయలు కాల్చుకో బోయి, పిల్లలెవరో విసరిన టపాకు గుడిసెలకు నిప్పు అంటించిదా?ఏమి టది? ఏమయ్యింది. కారు లాక్ చేసి చెట్లకేసి నడిచాను ఆదుర్దాగా. . . ఎదురుగా వగరుస్తూ ఆ యువకుడు. . .ఉదయం నాకు మంచం వాల్చిన యువకుడు పరుగెత్తుక వస్తున్నాడు. . .

"ఏమిటి? ఏమయ్యింది?" అతగాణ్ణి ఆపి ప్రశ్నించాను. నా వేపు క్షణకాలం విస్మయంగా చూశాడు నమ్మ లేనట్లు, మరుక్షణం భోరున ఏడ్చేశాడు.

"ఏమయిందో చెప్పు!" అరిచాను.

అతగాడు ఏడుపు సంబాళించుకున్నాడు.

"ఏం చెప్పను బాబూ? జలసాగా పండగ చేసుకోమని నువ్వు డబ్బిచ్చావు గానీ బాబయ్యా, ఈ ఎదవలకు గుణం ఇవ్వ గలవా? ఆ డబ్బుతో పీకలమొయ్యా తిని వూరుకోక, పూటుగా తాగి కొట్లాడు కున్నారు; రోసం పెరిగి ఒకరి కొంపల కొకరు అగ్గెట్టు కున్నారు. కూటికి లేనోళ్లలో కూడా ఈ పోటీలు, పెగ్గెలూ ఎందుకో బాబూ? ముసలీ

ముతకా, పిల్లా జెల్లా అంతా పదిమందిదాకా సచ్చిన్రు! ఆ మంగ...
అదికూడా మంటల్లో పడి..."

ఇంకా వాడేదో చెబుతున్నాడు...నాచెవులు దిబ్బళ్ల పడిపోయాయి!
శరీరమంతా చెమటలు పట్టింది. ఒక్కదూకులో కారులో వచ్చిపడ్డాను...
కారు శరవేగంతో దూసుకుపోతోంది! నా తల తిరిగిపోతోంది!

నే నాశించిందేమిటి? జరిగిందేమిటి? మనిషి మనస్తత్వమేమిటి?
ఆశించని డబ్బు మనిషిలో పశుత్వాన్ని ప్రకోపింప జేస్తుందా? నేను
అపాత్రదానం చేశానా? లేక నా దానాన్ని పరిగ్రహించగల అర్హత
వారిలో లేదా? చీకటిలో వున్నవారిలో, వెలుగు ప్రసరింప జేయాలన్న
నా ప్రయత్నం ఇలా పరిణమించి నాలోనూ చీకటిని నింపివేసిందా?

తప్పెవరిది? నాదా?

అనవసరమైన జాలి చూపిన నాదా?

మనిషిలోని పశుత్వాన్ని పైకి తీసిన డబ్బుదా?

లేక చీకటి వెలుగులలో చీకటినే ఆశ్రయించే మనిషి మనస్తత్వా
నిదా? సమాధానం ఎవరు చెబుతారు? తప్పెవరిది?

దూరంగా నా బంగళా కనిపిస్తోంది! అందంగా అమర్చిన బల్బుల
తోరణాలతో వెలుగులు విరజిమ్ముతోంది... బంగళా సమీపించింది
కారు...అంత వెలుగూ నాలోని చీకటిని పారద్రోలలేక పోతోంది! నా
కళ్ళు చీకట్లు క్రమ్ముతున్నాయేమో?

("విశ్వరచన" జనవరి'69)